క్లుప్తంగా

నేడు నకిరేకల్‌లో జాబ్ మేళా

నకిరేకల్: పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం జాబ్ మేళా ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్హత ధ్రువపత్రాలు, బయోడేటాతో ఉదయం 9గంటలకు జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. సుమారు 60 పైగా కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని తెలిపారు. ఎంపికైన వారికి వెంటనే ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు బచ్చుపల్లి గంగాధర్‌రావు, సుంకరబోయిన నర్సింహయాదవ్, పన్నాల రాఘవరెడ్డి, గాజుల సుకన్య, కొండ వెంకన్న, నకిరేకంటి నరేందర్, యాసా కరుణాకర్‌రెడ్డి, లింగాల వెంకన్న, ఉగ్గిడి శ్రీనివాస్, చౌగోని శ్రీను, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్సీ యువతకు ఉచిత శిక్షణ

నల్లగొండ రూరల్: తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఫర్ నర్సెస్ ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ఎస్సీ నిరుద్యోగ యువతీ, యువకులకు జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, డయాలసిస్ టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ మేనేజర్ సైదులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9059902355 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సింగారం వాసికి డాక్టరేట్


కుమారస్వామి

మునుగోడు: మండలంలోని సింగారం గ్రామానికి చెందిన గుంటుక కుమారస్వామి ఉస్మానియా యూనవర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. యూనివర్సిటీలోని లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. యాదగిరి పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్రంలోని ఫార్మసీ కళాశాలల గ్రంథాలయాలపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ అందుకోనున్నారు. సింగారం గ్రామ ప్రజలు కుమారస్వామికి అభినందనలు తెలిపారు.

అడ్మిషన్ల గడువు పెంపు

మర్రిగూడ: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చేరేందుకు గాను అడ్మిషన్ల గడువును మార్చి 2వ తేదీ వరకు పెంచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. శివస్వరూపరాణి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో 6వ తరగతిలో వంద సీట్లు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు ఆదర్శ పాఠశాలను సంప్రదించాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రామగిరి(నల్లగొండ): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం తిప్పర్తి పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడుగులపల్లి మండలం చిరుమర్తి గ్రామానికి చెందిన ఆకిటి శేఖర్ చిరుమర్తి వాగు నుంచి తిప్పర్తి మండలం ఇండ్లూరుకు ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇసుక తరలింపునకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌నుపోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆకిటి శేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి. రాజు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కట్టంగూర్: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు.. అయిటిపాముల గ్రామానికి చెందిన లట్టుపల్లి సైదమ్మ తన పెద్ద కుమార్తె నూతన గృహప్రవేశం వేడుకకు హాజరయ్యేందుకు శుక్రవారం నల్లగొండకు వెళ్లింది. ఇదే అదనుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు అదేరోజు రాత్రి సైదమ్మ ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని రెండు తులాల బంగారు ఆభరణాలు, రూ.20వేల నగదు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం నల్లగొండ నుంచి ఇంటికి వచ్చిన సైదమ్మ ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అదుపుతప్పి జేసీబీ బోల్తా

శాలిగౌరారం: మండలంలోని ఆకారం గ్రామంలో చెరువు మట్టిని ట్రాక్టర్లలో లోడ్ చేస్తుండగా జేసీబీ బోల్తాపడింది. వివరాలు.. ఆకారం గ్రామానికి చెందిన కొందరు రైతులు చెరువులోని ఒండు మట్టిని శనివారం రెండు జేసీబీల ద్వారా ట్రాక్టర్లలో నింపి పొలాల్లోకి తరలిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఎల్మకంటి సైదులుకు చెందిన జేసీబీ ట్రాక్టర్లలో మట్టి నింపుతుండగా అదుపుతప్పి బోల్తాపడింది. జేసీబీ డ్రైవర్ జినుక నరేశ్‌కు స్వల్పగాయాలు కాగా జేసీబీ పాక్షికంగా ధ్వంసమైంది.

విద్యతోనే మంచి భవిష్యత్తు

శాలిగౌరారం: విద్యతోనే భవిష్యత్తు మెరుగుపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం–1లో శనివారం మహిళా సాధికారత, బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమాలపై మహిళలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికలను చదివించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం

- పట్టువస్త్రాలు సమర్పించిన నకిరేకల్ ఎమ్మెల్యే దంపతులు


తాళిబొట్టు చూపుతున్న అర్చకులు


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు


కల్యాణంలో పాల్గొన్న ఆలయ అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి తదితరులు

నార్కట్‌పల్లి: మండల పరిధిలోని గోపలాయపల్లి గ్రామ సమీపంలో కొలువైన శ్రీవారిజాల వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని దేవాలయ ప్రధాన అర్చకులు ప్రతాపురం మత్స్యగిరిచార్యులు, వెంకటేశ్వరాచార్యులు తదితరులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఎదుర్కోలు ఉత్సవం జరిపించి ఉత్సవ మూర్తులను కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం,పుష్ప దంపతులు, దేవాలయ అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. కల్యాణోత్సవంలో దాదాపు 350 మంది జంటలు పాల్గొన్నారు. సీఐ నాగరాజు పర్యవేక్షణలో ఎస్‌ఐ అంతిరెడ్డి ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కల్యాణోత్సవంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోసుల భద్రాచలం, దార యాదయ్య, రాచకొండ భాస్కర్, యాట సైదులు, బెల్లి గణేష్, నర్ర నర్సిరెడ్డి, మచ్చ రాజు, బైరు అంజి, మచ్చ లింగస్వామి, ఈశ్వరయ్య, వేణు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు పానుగోటి అంజన్‌రావు


కస్తూర్బా పాఠశాలలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అంజన్‌రావు

మర్రిగూడ: బాలల హక్కుల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు పానుగోటి అంజన్‌రావు అన్నారు. శనివారం మర్రిగూడ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రం, యరగండ్లపల్లి హైస్కూల్, తమ్మడపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపుతానన్నారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు తమ్మడపల్లి ప్రాథమిక పాఠశాలకు ఆయన వంట గ్యాస్ అందించడంతో మధ్యాహ్న భోజన వండే వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేషనల్ అడ్వైజర్ కమిటీ మెంబర్ డాక్టర్ సయ్యద్ మతీన్ అహ్మద్, బాలల సంక్షేమ సమితి చైర్మన్ చింత కృష్ణ, మెంబర్లు ఈద భాస్కర్, విడబోయిన కిరణ్, వీరేందర్‌కుమార్, సీడీపీఓలు గణేష్, లావణ్యకుమారి, సూపర్‌వైజర్ ముమ్మడి యశోద, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి

- మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబా


మాట్లాడుతున్న షేక్ బాబా

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లాలో నిర్వహించనున్న విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబా పిలుపునిచ్చారు. శనివారం తిప్పర్తి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలో డిండి నుంచి ఈ నెల 28న విజయ సంకల్ప యాత్ర ప్రారంభమై నాగార్జునసాగర్, మిర్యాలగూడ, కోదాడ, సూర్యాపేట మీదుగా మార్చి 1వ తేదీన తిప్పర్తి మండల కేంద్రానికి యాత్ర చేరుకుని నల్లగొండకు వెళ్తుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో యువత, విద్యావంతులు మరోసారి బీజేపీనే గెలుపొందాలని కోరుకుంటున్నట్లు పలు సర్వేల ద్వారా తెలిసిందన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుండా వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వంగూరి రవి, బ్రహ్మచారి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నాగరాజు, గడ్డం వెంకట్‌రెడ్డి, నాయకులు ప్రకాష్, వెంకటేశ్వర్లు, నకిరేకంటి మహేష్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


హెలికాప్టర్‌లో దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు వస్తున్న డిప్యూటీ సీఎం, మంత్రులు


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ చందనాదీప్తి


డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్, మిర్యాలగూడ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు


హెలికాప్టర్ నుంచి అభివాదం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్

సంక్షిప్త సమాచారం

కైరళి స్కూల్ అనుమతి రద్దు చేయాలి

మునుగోడు: ఫీజు చెల్లించలేదని విద్యార్థుల తల్లిపై చేయి చేసుకున్న మునుగోడులోని కైరళి పబ్లిక్ స్కూల్ అనుమతిని వెంటనే రద్దు చేయాలని టీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నల్లగొండ అంజి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మునుగోడులో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం పేద విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఆనంద్‌నగర్‌లో గల వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. శనివారం స్వామివారి కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పూర్ణాహుతి, చక్రతీర్థం, పవళింపు సేవ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మారం గోపాల్‌రెడ్డి, కార్యదర్శి యాదా వాసుదేవ్, సభ్యులు మేరెడ్డి యాదగిరిరెడ్డి, పిచ్చయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థికసాయం అందజేత

చిట్యాల: మండలంలోని వెంబాయి గ్రామానికి చెందిన గుణగంటి వెంకటేష్ కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వెంకటేష్ చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 1994–95లో పదో తరగతి చదివాడు. వెంకటేష్ అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న అతడి స్నేహితులు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50వేలు సేకరించి శనివారం వెంకటేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో మందుగుల వెంకటేష్, కుంభం శ్రీను, సాగర్ల నర్సింహ, గురుజ లింగయ్య, ఉయ్యాల పాండు, సుజాత, కవిత, రూప పాల్గొన్నారు.

మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి

కేతేపల్లి: రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం చట్ట బద్ధత కల్పించాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. పంటలకు కనీస మద్దతు ధర, స్వామినాథన్ కమిటీ సిఫారసుల అమలు కోసం రైతులు ఢిల్లీ సరిహద్దులో గత 12 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్రం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఆందోళనలో పాల్గొని మృతిచెందిన రైతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు.

హెచ్‌ఎంలను సస్పెండ్ చేయాలి

నల్లగొండటౌన్: డీఈఓ, ఎంఈఓ అనుమతి లేకుండా ప్రభుత్వ పాఠశాలలకు లోకల్ హాలిడే ఇచ్చిన హెచ్‌ఎంలను సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ అన్నారు. ఆదివారం ఆయన నల్లగొండ ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తిప్పర్తి మండలంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాధికారుల అనుమతి లేకుండా చెర్వు గట్టు జాతరకు హాలిడే ఇచ్చిన హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కుంచం కావ్య, స్పందన, అశోక్‌బాబు, కళ్యాణ్ పాల్గొన్నారు.

సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం

కనగల్: మండలంలోని పగిడిమర్రి లో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సీతారామచంద్రస్వామి కల్యాణ వైభవంగా నిర్వహించారు. ఆదివారం వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎర్రమాద యశోదమ్మ, మాజీ సర్పంచులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

నల్లగొండక్రైం: డబ్బు విషయంలో జరిగిన గొడవలో ఇరు వర్గాలపై శనివారం నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలం ఆరెగూడేనికి చెందిన రేవంత్‌రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన తాటికొండ విశ్వభార్గవ నర్సింహారెడ్డికి ఆన్‌లైన్ వ్యాపారం నిమిత్తం రూ.50లక్షలు ఇచ్చాడు. అంతేకాకుండా తన స్నేహితుల ద్వారా కూడా 2022లో నర్సింహారెడ్డికి రేవంత్‌రెడ్డి డబ్బులు ఇప్పించాడు. అయితే డబ్బుల విషయమై ఎన్నిసార్లు అడిగినా నర్సింహారెడ్డి ఇవ్వకపోవడంతో హైదరాబాద్ నుంచి మకాం మార్చి నల్లగొండకు వచ్చాడు. ఈ క్రమంలో రేవంత్‌రెడ్డి డబ్బుల విషయమై నల్లగొండలో ఉంటున్న నర్సింహారెడ్డి ఇంటికి వెళ్లగా.. ఇంట్లో ఉన్న కత్తితో రేవంత్‌రెడ్డిపై నర్సింహారెడ్డి దాడి చేశాడు. ఈ దాడిలో వారిద్దరికి గాయాలయ్యాయి. ఇరువురు శనివారం ఒకరిపై ఒకరు నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నకిరేకల్: నకిరేకల్ వైద్య ఆరోగ్య శాఖ ఐఎన్‌టీయూసీ(3194) యూనిట్ నూతన కార్యవర్గాన్ని స్థానిక ఏరియా ప్రభుత్వాస్పత్రిలో శనివారం జిల్లా అధ్యక్షుడు భిక్షం, ప్రధాన కార్యదర్శి విశ్వనాథుల నర్సింహాచారి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. యూనిట్ అధ్యక్షుడిగా గగ్గేనేపల్లి కరుణాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పసల మేరీ, కోశాధికారిగా మొల్గురి భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హైమావతి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, మాధురి, ఇన్యాసమ్మ, దయామణి, లూవర్యనాయక్, జాయింట్ సెక్రటరీగా నరేందర్‌రెడ్డి, జానకి, పద్మ, శాంతి, సుమతి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పద్మ, సైదులు, చారి, రమేష్, జయమ్మ, ఈసీ మెంబర్లుగా సునీత, సువర్ణ, మంజుల, శేఖర్, పార్వతి ఎన్నికయ్యారు.

రంజాన్ మాసానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలి


ఈద్గాను సందర్శించిన మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

రామగిరి(నల్లగొండ): వచ్చే నెలలో రంజాన్ మాసం ప్రారంభమవుతున్నందున అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శనివారం నల్లగొండ పట్టణంలోని 12వ వార్డులో ఉన్న ఈద్గాను స్థానిక కౌన్సిలర్, మైనార్టీ కౌన్సిలర్లు, ఈద్గా కమిటీ సభ్యులతో కలిసి ఆయన సందర్శించి మాట్లాడారు. ఈ నెల 26న షబే బరాత్ జాగారం రోజున ముస్లిం గ్రేవ్ యార్డ్స్ అన్నింటిని శుభ్రం చేసి ఇబ్బందులు కలగకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈద్గాలో ఉన్న పెండింగ్ రోడ్డు పనులను రంజాన్ నెల ప్రారంభం కంటే ముందే పూర్తిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా బుర్రి శ్రీనివాస్‌రెడ్డిని, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్‌ను ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, ఈద్గా కమిటీ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్తంభగిరి లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం


రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

మర్రిగూడ: మండలంలోని సరంపేట గ్రామంలో గల స్తంభగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ముఖ్య హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. ఆలయం వద్ద తాగునీటి సమస్య తలెత్తకుండా, వాహనాల రాకపోకలకు రోడ్డు నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు చొరవ చూపుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెన్నమనేని రవీందర్‌రావు, పాముల యాదయ్య, ముద్దం నర్సింహగౌడ్, రాందాసు శ్రీనివాస్, భీమానాయక్, మాస చంద్రశేఖర్, బేత వెంకటేష్, ఏర్పుల శ్రీశైలం, మేతరి యాదయ్య, రావుల రాములుగౌడ్ ఆలయ అర్చకులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మణాపురం రిజర్వాయర్ పనులు త్వరగా పూర్తిచేయాలి


లక్ష్మణాపురం రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



నాంపల్లి: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న గాంధీజీ పాఠశాల యాజమాన్యం

నాంపల్లి: లక్ష్మణాపురం రిజర్వాయర్ పనులను త్వరగా పూర్తిచేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నాంపల్లి మండల కేంద్రంలోని గాంధీజీ పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి గురవారావు, జెడ్పీటీసీ ఏలుగొటి వెంకటేశ్వర్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ కొడి శ్రీనివాస్, డైరెక్టర్లు కర్నాటి నాగరాజు, సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మణాపురం రిజర్వాయర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూ నిర్వాసితులను కలిసి పూర్తిస్థాయిలో పరిహారం అందిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పరిహారం అందని వారికి త్వరలోనే పరిహారం అందించాలని సీఎంను కోరతానన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ ఏలుగొటి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎరెడ్ల రఘుపతిరెడ్డి, పూల వెంకటయ్య, రాజునారాయణరెడ్డి, అంగిరేకుల పాండు, కత్తి రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషిచేస్తా


ఎమ్మెల్యే వేముల వీరేశంను సన్మానిస్తున్న రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు

నకిరేకల్: దేవాలయాల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం నకిరేకల్‌లోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రామలింగేశ్వరస్వామి ఆలయం చుట్టూ సీసీ రోడ్డు నిర్మించాలని ఆయల చైర్మన్ ఉప్పల రమేష్ ఎమ్మెల్యేను కోరగా.. త్వరలో నిధులు మంజూరు చేయించి పనులు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆలయ ఆర్చి నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అధికారి లక్ష్మి ఆలయ చైర్మన్ ఉప్పల రమేష్, ధర్మకర్తలు కొండ వెంకన్నగౌడ్, బొప్పని యాదగిరి, కందాల ప్రవీణారత్నారెడ్డి, చెన్న చంద్రశేఖర్‌చే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవీగంగాధర్‌రావు, మాజీ ఎంపీపీ చామల శ్రీనివాస్, సాయి, అంజనేయ, కాళీకామాత ఆలయాల చైర్మన్లు వనమా వెంకటేశ్వర్లు, గజ్జల సూర్యప్రకాష్, గర్రె మురళి, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంఈఓ అరుంధతి

నల్లగొండ: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని నల్లగొండ ఎంఈఓ కత్తుల అరుంధతి అన్నారు. శనివారం నల్లగొండ మండలంలోని కతాల్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా వార్షికోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కవి, రచయిత బెల్లి యాదయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తరాల పరమేష్‌యాదవ్, ప్రముఖ గాయకుడు చింతల యాదగిరి, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళం నారాయణరెడ్డి, కౌన్సిలర్ కంకణాల లక్ష్మమ్మ, నాగిరెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు వినతి


భట్టివిక్రమార్కకు వినతి పత్రం అందజేస్తున్న తుమ్మల వీరారెడ్డి, జూలకంటి రంగారెడ్డి

నల్లగొండటౌన్: ఎలక్ట్రిసిటీ స్టోర్ హమాలీలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఆదివారం దామరచర్లకు వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు సీఐటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 220 మంది ఎలక్ట్రిసిటీ స్టోర్ కార్మికులు రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జూలకంటి రంగారెడ్డి, కత్తుల యాదయ్య, శ్రీనివాస్, శంకర్, యాదగిరిరెడ్డి ఉన్నారు.

బ్యాంకింగ్‌లో ఉజ్వల భవిష్యత్తు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐడీబీఐ రీజనల్ హెడ్ ఖాసీం

నల్లగొండ రూరల్: బ్యాంకింగ్ రంగంలో ఉజ్వల భవిష్యత్తు ఉందని ఐడీబీఐ రీజనల్ హెడ్ ఖాసీం అన్నారు. శనివారం మహాత్మా గాంధీ యూనివర్సిటీలో నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్యాంక్ ఉద్యోగాల్లో ఎంపికయ్యేందుకు పాటించాల్సిన మెలకువలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆకుల రవి, శ్రీదేవి, సరిత తదితరులు పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం


నకిరేకల్ జెడ్పీ హైస్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు


కట్టంగూర్: రామచంద్రాపురం ప్రాథమిక పాఠశాలలో..


కనగల్ : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..


కట్టంగూర్: సాందీపని ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో..